


ఘనంగా టియుడబ్ల్యుజె(ఐజెయు) నల్లగొండ జిల్లా మహాసభలు

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
గురువారం | 04 జూన్ , 2026 | పేజీలు : 06

# సమన్వయంతో పనిచేద్దాం

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వీటిని విజయవంతం చేయాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో వర్షాకాల ముందస్తు చర్యలు, శానిటేషన్, త్రాగునీరు, ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సభలకు మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని, ఇందుకు సంబంధించిన సిబ్బంది వివరాలను తక్షణమే సమర్పించాలని ఆదేశించారు. ఎండాకాలం తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్రామసభలను ఉదయమే నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సభలు జరిగే చోట తాగునీరు వంటి అన్ని కనీస మౌలిక వసతులు కల్పించాలని, షెడ్యూల్ వివరాలను గ్రామాల్లో ముందే చాటింపు వేయించి ప్రజలకు సమాచారం అందించాలన్నారు.



**ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన**

ఈ వర్షాకాలంలో జిల్లాలో సాధారణం కంటే కొంత తక్కువ వర్షపాతం నమోదయ్యే ఆస్కారం ఉందని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం ఎక్కువగా పండుతుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులను క్రాప్ డైవర్షన్ వైపు ప్రోత్సహించాలన్నారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు గ్రామసభల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

**ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బిఎల్‌ఓలు ప్రతి ఇంటికి తిరిగి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలిస్తారన్నారు. జూలై 31న ఓటరు ముసాయిదా (డ్రాఫ్ట్) జాబితా ప్రచురణ జరుగుతుందని, అనంతరం అభ్యంతరాల స్వీకరణ, నోటీసుల జారీ ఉంటుందని వివరించారు. అక్టోబర్ 1వ తేదీన ఓటర్ల తుది జాబితాను విడుదల చేస్తారని పేర్కొన్నారు. 2002 నాటి జాబితా ప్రకారం కొత్త ఇంటెన్సివ్ జాబితాను తయారు చేయడం జరుగుతుందన్నారు. జాబితాలో ఉన్న ప్రతి ఓటరు వివరాలను ఎలిమినేషన్ ఫామ్‌లో నమోదు చేసి, నిర్ధారించుకుని బిఎల్‌ఓలకు అందించాలన్నారు. 2002 ఓటరు జాబితాలో పేరులేని వారు తమ తల్లిదండ్రుల వివరాలను ఫామ్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని, ఒకవేళ తల్లిదండ్రుల పేరు కూడా లేకపోతే ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జడ్‌పి సిఈఓ శిరీష, డిఆర్‌డిఓ సన్యాసయ్య, డిపిఓ యాదిగిరి, మీషన్ భగరీథ ఇఇ అరుణాకర్ రెడ్డి, డిఇఓ అశోక్, డిఐఇఓ సులోచన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నగరంలో ప్రత్యేక వార్డు సభలను విజయవంతం చేయండి

### కమిషనర్ శరత్ చంద్ర



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించనున్న ప్రత్యేక వార్డు సభలపై మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో సెక్షన్ హెడ్‌లు, వార్డు అధికారులు, పర్యవేక్షణ అధికారులు,శానిటరీ జవాన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 4.న 12 డివిజన్లు,6న 12 డివిజన్లు,8న 12 డివిజన్లు,10న 12 డివిజన్లలో ప్రత్యేక వార్డు సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి వార్డు అధికారి తనకు కేటాయించిన డివిజన్‌లో ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, అమృత్ మిత్ర గ్రూపులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో వార్డు సభలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.వార్డు సభల ద్వారా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2026 ప్రకారం నాలుగు రకాల చెత్త వేరు చేయడం, ఈవేస్ట్ నిర్వహణ, వర్షాకాల సన్నద్ధత, డ్రైనేజీల శుభ్రత, తాగునీటి సరఫరా, నీటి నిల్వల నివారణ, వీధి దీపాల నిర్వహణ, మొక్కల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణ తదితర అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే వార్డు సభల ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొంటూ,నగర ప్రజలందరూ తమ తమ డివిజన్లలో నిర్వహించే వార్డు సభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సహాయ నగర ప్రణాళికాధికారిజె.కృష్ణవేణి,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.అశోక్ కుమార్,అసిస్టెంట్ ఇంజనీర్లు,ఎం. ఆసిమ్ బాబా,టి.ప్రవీణ్, కార్యాలయ సిబ్బంది,వార్డు అధికారులు, పర్యవేక్షణ అధికారులు,శానిటరీ జవాన్లుపాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల కబ్జాలపై కఠిన చర్యలు

## నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ** : ప్రభుత్వ భూములు,చెరువుల శిఖం భూములను అక్రమంగా కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌డీఓలు,తహసీల్దార్లతో సాదా బైనామా,భూభారతి,ల్యాండ్ సర్వే అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులకు త్వరగా న్యాయం చేయాలన్నారు. సాదా బైనామా పరిష్కారంలో డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రభుత్వ భూములు,చెరువుల శిఖం భూములు,ఇతర ప్రజా ప్రయోజన భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూభారతి కేసులను వేగంగా పరిష్కరించాలని సూచించారు.డివిజన్ స్థాయి ప్రజావాణిలో వచ్చిన సమస్యలు జిల్లా స్థాయికి రావడం సరికాదని, స్థానికంగానే పరిష్కరించాలన్నారు. ఇకపై తాను డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.అదేవిధంగా



అటవీ, రెవెన్యూ, దేవాదాయ శాఖలకు చెందిన భూముల సర్వేను వేగవంతం చేసి, భూ రికార్డులను సమగ్రంగా రూపొంది చాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్ నాయక్,ల్యాండ్ సర్వే ఏడి ధీరజ్,ఆర్‌డీఓలు,తహసీల్దారులు , ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం




ఒకరు మృతి, 200 గొర్రెలు,మేకలు మృత్యువాత



## నిధులు విడుదల చేసి, జీవో నెంబర్ 7ను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** రాష్ట్రంలో ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసి, జీవోనెంబర్ 7ను రద్దు చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నేరేడుచర్ల తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకపోవడంతో బిసి వ్యతిరేక పార్టీగా ముద్ర వేసుకుంటున్నదన్నారు. ఇప్పుడు జీవో నెంబర్ 7ను రద్దు చేయకపోతే రాష్ట్రంలోని బిసి సంఘాలన్ని ఐక్యమై విద్యార్థుల భవిష్యత్ కోసం, ఉద్యమ బాట పట్టకతప్పదన్నారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి నాయకులు చిలకరాజు శ్రీను, కొమ్మరాజు వెంకట్, బత్తిని శ్రీనివాసగౌడ్, పరికె భరత్, కల్లూరు సైదాచారి, మట్ట పల్లిరావు, మల్లేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో బుధవారం మండల విద్యాధికారి బాలునాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026/27 విద్యా సంవత్సరానికి గాను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 11,645 పాఠ్యపుస్తకాలు, 11,235 నోట్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.సత్యనారాయణరెడ్డి, బి.మధు, ఎల్. శ్రీనివాసరావు, రవీందర్‌రెడ్డి, ఎంఆర్‌సి సిబ్బంది ప్రతాప్, నాగేందర్, సిఆర్‌పిలు శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్, పద్మ పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన నేత్ర సేవలు అందించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజలకు నాణ్యమైన నేత్ర సేవలు అందించాలని మౌలానా అత్తర్ సాబ్, మౌలానా అమర్ అబిసాబ్ అన్నారు. బుధవారం పట్టణంలోని విద్యానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హనియాస్ స్పెక్ట్రా విజన్ కంటి అద్దాల, నేత సంరక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక కంటి పరీక్షలు, నాణ్యమైన లెన్స్‌లు, స్టైలిష్ ఫ్రేమ్‌లు, హోమ్‌డెలివరి సేవలు వంటి సౌకర్యాలతో ఈ కేంద్రం ప్రజలకు మెరుగైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. వ్యాపార సంస్థ అభివృద్ధి చెందుతూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సలీం, సిద్దిక్, బషీర్ రెహమాన్, రహమాన్ మౌలానా, భాషిత్ మౌలానా, ఆసిఫ్, నిర్వాహకులు సయ్యద్ రెహమాన్ పాల్గొన్నారు.



# గంజాయి నిర్మూలనే లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తనిఖీలు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** గంజాయిలాంటి మాదక ద్రవ్యాల నిర్మూలన గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్'తో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్‌పి కె.నర్సింహా ఆదేశాలతో హుజూర్‌నగర్‌లోని వివిధ హోటల్స్, టీ దుకాణాలు, మెడికల్ షాపులు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాల్లో తనిఖీలు, సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో గంజాయిలాంటి మాదకద్రవ్యం మన యువత సమాజాన్ని పట్టి పీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం పోలీస్ వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించే వారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్న అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ బలరాంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# బెస్ట్ అవైలబుల్ స్కీంకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లాలో చదువుతున్న ఎస్‌సి విద్యార్థిని, విద్యార్థుల కొరకు 2026/27 విద్యా సంవత్సరమునకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఇంగ్లీష్ మీడియం 1వ తరగతి (డే స్కాలర్), 5వ తరగతి (రెసిడెన్సియల్) విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి కె. దయానంద రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో దరఖాస్తు చేసుకొనుటకు తేది.13.06.2020 నుండి 12.06.2021 వరకు గల మధ్య కాలములో జన్మించిన వారు మాత్రమే అర్హులని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం తేది.01.04.2026 తర్వాత రూ.1లక్ష 50వేల లోపు గ్రామీణ ప్రాంతములలో నివసించే వారికి, రూ.2లక్షల లోపు పట్టణ ప్రాంతములో నివసించే వారికి ఉండవలెనని పేర్కొన్నారు. కుల, ఆదాయ, నివాస, జనన ధృవీకరణ పత్రము (మీసేవ చే ధృవీకరణ పత్రము సమర్పణ), రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ప్రస్తుతము చదువుతున్న పాఠశాల బోనోఫైడ్, రెండు పాసుపోర్ట్ సైజు ఫోటోలతో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయం, సూర్యాపేట నందు దరఖాస్తు పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను తేది.06.06.2026 సాయంత్రం 5 గంటల వరకు జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయం, సూర్యాపేట నందు సమర్పించాలని సూచించారు. ఈ పథకమునకు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ సభ్యులలో గతములో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నందుగాని, బెస్ట్ అవైలబుల్ స్కీం కింద గాని చదువుతున్నట్లు అయితే ఇప్పుడు దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం లేదని స్పష్టం చేశారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్, సూర్యాపేట కలెక్టరేట్ నందు తేది.10.06.2026న ఉదయం 11 గంటలకు డ్రా పద్ధతిన విద్యార్థులను తీసుకోబడుతుందన్నారు. ఆలస్యముగా వచ్చిన దరఖాస్తులను స్వీకరించబడవన్నారు.

# జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ రామన్నపేట :** తెలంగాణ ఉద్యమకారుడు టీపిసిసి ఎస్సి సెల్ స్టేట్ సెక్రటరీ గద్దం యాదగిరి 53వ జన్మదిన వేడుకలు ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న, రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి గౌరవాధ్యక్షులు పోతరాజు శంకరయ్య పాల్గొని గద్దం యాదగిరిని శాల్వాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యావేత్త ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె చాంద్, రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలోపల్లివాడ గ్రామం నుంచి రామన్నపేట మండల కేంద్రంలో ప్రముఖ పాత్ర వహించిన వ్యక్తులలో ముఖ్యమైన వారిని తెలిపారు.అనంతరం రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న మాట్లాడుతూ చిందు సామాజిక వర్గానికి చెందిన గద్దం యాదగిరి తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి 57 ఉపకులాల కోసం పోరాటం చేయడంలో ముఖ్యపాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు నోముల శంకర్, రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి లీగల్ సెల్ అడ్వైజర్ ఉద్యమకారుడు కూనూరు శ్రీనివాస్ గౌడ్, ఎర్ర రమేష్ గౌడ్, ఉద్యమ నాయకులు స్థానికం చీఫ్ ఎడిటర్ కొండ మల్లేశం గౌడ్, మన ప్రగతి రిపోర్టర్ కైరం కొండ సంతోష్ కుమార్, రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి నాయకులు రవి, బాలయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.



## నేటి నుంచి ప్రజాపాలన గ్రామసభలు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల వ్యాప్తంగా నేటి నుంచి జూన్ 10 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్నాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ. జానయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు ఆయా గ్రామ పంచాయితీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలలో ఈ సభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు జూన్ 4న అనాజీపురం, అనంతారం, అన్నారం బ్రిడ్జి, భక్తలాపురం, చీదెళ్ల, చెట్లముకుందాపురం, చినసీతారాం తండలలో సభలు జరుగుతాయని వివరించారు. జూన్ 6న ధర్మాపురం, దూపహాడ్, దోసపహాడ్, దుబ్బతండ, గాజులమల్కాపురం, గూడెపుకుంట తండ, జల్మలకుంట తండ, లింగాల, మాచారం, మేగ్యాతండలలో నిర్వహిస్తామన్నారు. జూన్ 8న మహ్మదాపురం, మొర్సకుంటతండ, ఎన్.అన్నారం, నాగులపహాడ్, నారాయణగూడెంలోనూ, చివరిరోజు జూన్ 10న న్యూబంజారాహిల్స్ తండ, పెన్‌పహాడ్, పొట్లపహాడ్, రంగయ్యగూడెం, సింగిరెడ్డిపాలెం, తంగెళ్లగూడెం గ్రామాలలో ఈ సభలు జరగనున్నట్లు వెల్లడించారు. ప్రజాసమస్యల తక్షణ పరిష్కారం, గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సాగే ఈ సభల పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారుల బృందాన్ని రంగంలోకి దింపామని తెలిపారు. ప్రజలందరూ నిర్ణీత సమయానికి హాజరై ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు.

# నేటి నుండి వర్షాకాలం... ముందస్తు కార్యాచరణ ప్రణాళిక

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మున్సిపాలిటీ లో నేటి నుండి వర్షాకాల ముందస్తు చర్యలు తీసుకోవడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ, వార్డుల వారిగా ఒకేసారి చర్యలు తీసుకునేలా సిబ్బందిని కేటాయించారు. నేటి నుండి పదో తేదీ వరకు ఈ ముందస్తు చర్యలు తీసుకునేందుకు వార్డు సభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం సిబ్బంది ఒకరోజు ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్లో పేర్కొన్న కార్యాచరణ పట్ల అవగాహన కల్పించుటకు వార్డు సభ్యులు, ఎన్జీవోస్ వివిధ యువజన సంఘం ప్రజలు సహకరించి తీసుకున్న నిర్ణయాలను అమలు చేసేటట్లుగా ఉత్తర్వులో అంశాలపై జాగ్రత్తలు పనులు చేపట్టిన ఉన్నట్లు తెలిపారు.

## ఓటు హక్కును కాపాడుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు కాపాడుకోవాలని, సర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక ధృవీకరణ) పేరుతో మైనార్టీలు, దళితులు, ఆదివాసీల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగే పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ధృవీకరణ పత్రాలు లేమి కారణంగా పేద ప్రజలు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని బిజెపి చూస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి. సాగర్, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటి సీట్లు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కోదాడ:** ఉపాధ్యాయులు బోధనతో పాటు అవసరమైన సమయంలో విద్యార్థులకు ఆర్థికసాయం చేయడం ద్వారా నిజమైన మార్గదర్శకంగా నిలుస్తారని మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాలకు సంబంధించిన పేద విద్యార్థులు బాసనబోయిన హరి, చిల్లంచర్ల విన్ని తమ ప్రతిభతో బాసర ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన సందర్భంగా వారి ఉన్నత విద్యాభివృద్ధికి ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌కె ఖాజామియా పదివేల రూపాయలు, బడుగుల సైదులు ఐదువేల రూపాయల ఆర్థికసాయం చేసిన సందర్భంగా విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు తమ ఉన్నత చదువులు పూర్తి చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థితికి చేరుకొని విద్యాభివృద్ధికి సామాజిక బాధ్యతతో కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను మండల విద్యాధికారి సలీంషరీఫ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓగా సందీప్

**ప్రజాపక్షం/మోతె :** మండల అభివృద్ధి అధికారిగా బి. సందీప్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి మండలంలోని ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఎలాంటి అసమానతలు లేకుండా ప్రభుత్వం అందించే ప్రతి పథకం ప్రతి ఒక్కరికి అందించేందుకు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.




## కోటయ్య సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** సమాజానికి పెరపంగి కోటయ్య చేసిన సేవలు మరువలేనివని పెన్‌పహాడ్ గ్రామ సర్పంచ్ ఒగ్గు రవి, టిఎంఆర్‌పిఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కత్తి ఉపేందర్ మాదిగ అన్నారు. బుధవారం నాగులపహాడ్ గ్రామంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, టిఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఒగ్గు దేవయ్య మామయ్య అయిన పెరపంగి కోటయ్య దశ దిన కార్యక్రమానికి వారు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మీసాల సోమయ్య, మామిడి సైదులు, ఒగ్గు బిక్షం, ఒగ్గు రాజు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు.

## యూనిఫామ్ అందజేత



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మున్సిపాలిటి పరిధిలోని చింతబండ 4వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 14వ వార్డు కౌన్సిలర్ సరికొప్పుల విజయలక్ష్మి చేతుల మీదుగా అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ చిన్న పిల్లల విద్యను అభ్యసించడానికి అంగన్‌వాడీ పాఠశాలలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గుడిపాటి జయమ్మ, అల్మసీస్, కమిటి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను బుధవారం సూర్యాపేట బిసి జెఏసి ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి జెఏసి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరోజు మదనాచారి మాట్లాడుతూ ఆయన జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి సమస్యపై గలమెత్తుతున్న నాయకుడు హరీష్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కక్కిరేణి నాగేంద్రబాబు, యోగి, ముత్యం, నాగేంద్రబాబు, సాయితేజ పాల్గొన్నారు.



## విద్య, వైద్య సదుపాయం కల్పించాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** సైనికులకు, మాజీ సైనిక కుటుంబాలకు మెరుగైన విద్య, వైద్య సదుపాయాలను కల్పించాలని తుంగతుర్తి నియోజక వర్గం పని చేస్తున్న సైనికులు ప్రత్యేక సమావేశం నిర్వహించుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా పలు శాఖలో పని చేసిన సైనికులు మాట్లాడుతూ దేశ సంరక్షణ కోసం అహర్నిశలు పనిచేస్తున్న తమపట్ల ప్రభుత్వాలు అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లాలో సైనికులకు వైద్య, విద్య సదుపాయాన్ని అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంటీన్ ఫెసిలిటి కల్పించి సూర్యాపేట జిల్లాలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సైనిక శాఖలో పనిచేసిన మాజీ సైనికులు అందరూ సైనిక శాఖ చుట్టూ తిరిగే విధంగా లేకుండా సింగిల్ విండో విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. సరిహద్దులో ప్రాణాలకు తెగించి పోరాడే మా సైనికుల పట్ల ప్రభుత్వం బాధ్యత అధికంగా వ్యవహరించి సైన్యులకు ప్రత్యేక గౌరవం కల్పించి జిల్లాలో ప్రత్యేక సైనిక స్కూల్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యా అవకాశము ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైనికులు ఇమ్మడి పవన్, ఆవుల మహేష్, మహేష్, శివ, భరత్ శ్రీనివాస్, పాష, సురేందర్, వెంకట్‌రాములు, ఇమ్మడి సోమయ్య పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రజాపాలన గ్రామసభలు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల వ్యాప్తంగా నేటి నుంచి జూన్ 10 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్నాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ. జానయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు ఆయా గ్రామ పంచాయితీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలలో ఈ సభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొలరోజు జూన్ 4న అనాజీపురం, అనంతారం, అన్నారం బ్రిడ్జి, భక్తలాపురం, చీదెళ్ల, చెట్లముకుందాపురం, చినసీతారాం తండలలో సభలు జరుగుతాయని వివరించారు. జూన్ 6న ధర్మాపురం, దూపహాడ్, దోసపహాడ్, దుబ్బతండ, గాజులమల్కాపురం, గూడెపుకుంట తండ, జల్మలకుంట తండ, లింగాల, మాచారం, మేగ్యాతండలలో నిర్వహిస్తామన్నారు. జూన్ 8న మహ్మదాపురం, మొర్సకుంటతండ, ఎన్.అన్నారం, నాగులపహాడ్, నారాయణగూడెంలోనూ, చివరిరోజు జూన్ 10న న్యూబంజారాహిల్స్ తండ, పెన్‌పహాడ్, పొట్లపహాడ్, రంగయ్యగూడెం, సింగిరెడ్డిపాలెం, తంగెళ్లగూడెం గ్రామాలలో ఈ సభలు జరగనున్నట్లు వెల్లడించారు. ప్రజాసమస్యల తక్షణ పరిష్కారం, గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సాగే ఈ సభల పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారుల బృందాన్ని రంగంలోకి దించామని తెలిపారు. ప్రజలందరూ నిర్ణీత సమయానికి హాజరై ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు.

## సబ్సిడీ జీలుగు విత్తనాలను రైతులు సద్వినియోగం



**ప్రజాపక్షం/కోదాడ:** సబ్సీడీ జీలుగు విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి కోరారు. బుధవారం కోదాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో రైతులకు రాయితీలపై జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే జీలుగు విత్తనాలను ప్రభుత్వం 50 శాతం సబ్సీడీతో అందిస్తోందన్నారు. 30 కేజీల బస్తాకు రాయితీ పోగా రైతులు తమ వాటా కింద 2452 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టదార్ పాస్‌పుస్తకం జీరాక్స్‌లతో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. రైతులు తొందరపడకుండా వర్షాలు పడ్డాక భూమిలో సరైన పదును చూసుకుని జీలుగు విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇవో పిచ్చయ్య, నగేష్, సిఈవో మంద వెంకటేశ్వర్లు, సోసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామసభలను ప్రజలు సద్వినియోగం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలో ఈనెల 4వ తేదీ నుండి పదవ తేదీ వరకు ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభలు అన్ని గ్రామాలలో ఏర్పాటు చేయాలని ఎంపిడివో మల్సూర్‌నాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం నందు ఉదయం 8 గంటలకు గ్రామ సభలు ప్రారంభించాలన్నారు. జూన్ 4న బృందావనపురం, చాకిరాల, శ్రీరంగాపురం, ఈకెపేట, 6న ఇకేపేట తండా, కాగితరామచంద్రాపురం, కరివిరాల, నడిగూడెం, 8న నారాయణపురం, రామాపురం, రత్నవరం, సిరిపురం, 10న చెన్నకేశవపురం, తెల్లబెల్లి, వల్లాపురం, వేణుగోపాలపురం గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎంపిడివో స్వర్ణలత అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన అమ్మ పేరుపై ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా ఆమె బుధవారం ఎంపిడివో కార్యాలయ ఆవరణలో ఒక చెట్టు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించి, పర్యావరణాన్ని పెంచవచ్చని అన్నారు. తద్వారా వాతావరణంలో సమతుల్యత ఏర్పడి సమయానికి వర్షాలు కురుస్తాయని, కరువు కాటకాలు సంభవించవని అన్నారు. మొక్కలు నాటి జీవ వైవిధ్యానికి తొడ్పడాలని పంచాయతీ కార్యదర్శులకు, మండల అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో జీవ వైవిధ్య ఉమ్మడి నల్గొండ జిల్లా కో ఆర్డినేటర్ రమావత్ శ్రవణ్‌కుమార్, సినియర్ అసిస్టెంట్ వినోద్‌కుమార్, ఎంపిడివో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## గుర్రం వెంకటరెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని గానుగబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుర్రం వెంకటరెడ్డి మృతి చెందడం కాంగ్రెస్‌పార్టీకి తీరనిలోటు అని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నా చిర కాల మిత్రుడు, ఆప్తుడు, శ్రేయోభిలాషి వెంకటరెడ్డి మరణం అత్యంత బాధకరమని అన్నారు. వారి కుటుంబ స భ్యులను ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడు మా సహాయ సహకారాలు ఉంటాయని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం వారు ఎనలేని సేవలు అందించారన్నారు. వ్యక్తిగతంగా తనకు సుధీర్ఘకాలం పరిచయంలో ఎప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా పనిచేయడం చూశానని అన్నారు.

## 4,6,8,10 తేదీలలో గ్రామసభలు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 4,6,8, 10 తేదీలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో సోమసుందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలలో వర్షకాల సన్నద్ధత, సురక్షిత తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, మన సంరక్షణ, మొక్కల పెంపకం, వనమహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరద నిర్వహణ భద్రత వ్యవసాయ పంట మార్పిడి విధానము మొదలగు వాటిపై చర్చించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని చెన్నకేశవపురం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కటికల పుల్లయ్య మాతృమూర్తి అలివేలు బుధవారం తెల్లవారుజామున వడదెబ్బతో మృతి చెందా రు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బూత్కూరి వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, సర్పంచ్ గోసుల రాజేష్, మాజీ ఉప సర్పంచ్ అనంతు ఉపేందర్ ఆమె మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరమార్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

**ప్రజాపక్షం/పాలకవీడు:** ఆరోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేదల పాలిట దేవుడిలా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిలిచారని పాలకవీడు సర్పంచ్ బుజ్జిమోతిలాల్ అన్నారు. బెట్టెతండా గ్రామానికి చెందిన ధీరావత్ రాజేష్‌కు మంత్రి ఉత్తమ్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 50 వేలు చెక్కును బుధవారం బాధిత రాజేష్ తండ్రి నాగేశ్వరరావుకు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. ఆరోగ్యసమస్యలతో ఆసుపత్రి ఖర్చులకు అప్పులు చేసి తల్లడిల్లుతున్న అనేక మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి కోరిన వెంటనే పరిహారం అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్న మంత్రి ఉత్తమ్ అని కొనియాడారు.

## టిజిఆర్‌జెసి ప్రవేశపరీక్షలో సీటు సాధించిన మైథిలి



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని సిరిపురం జడ్పి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన బొమ్మిడి మైథిలి టిజిఆర్ జెసి2026 ప్రవేశ పరీక్షలో 376వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దర్ర ఉపేందర్ తెలిపారు. టిజిఆర్ జెసి హసన్‌పర్తి, హనుమకొండ కార్పోరేట్ కళాశాలలో సీటు సాధించినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్తులు మైథిలికి అభినందనలు తెలిపారు.

## జాబ్‌కార్డులో నమోదు

ప్రజాపక్షం/గరిడేపల్లి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద అర్హులైన గ్రామీణ యువతి, యువకులను జాబ్‌కార్డుల్లో పేర్లు నమోదు చేయాలని ఉప సర్పంచ్ జోగు అరవింద్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ప్రతి కుటుంబంలో ఉన్నారని, వారందరిని జాబ్‌కార్డుల్లో చేర్పించి కొత్త వారికి ప్రభుత్వం జాబ్‌కార్డు మంజూరు చేయాలని కోరారు. దీని ద్వారా యువతి, యువకులకు ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీతో కూడిన వేతన ఉపాధి లభిస్తుందన్నారు.

## పిల్లలను పనుల్లో కాదు... పాఠశాలలో చేర్పించాలి



ప్రజాపక్షం/గుండాల; పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడానికి పిల్లలను పనులలో కాదు పాఠశాలలో చేర్పించాలని సిఆర్‌పి దేవనబోయిన లింగయ్య పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని బండకొత్తపల్లి, వస్తాకొండూరు, పెద్దపడిశాల, తుర్కలషాపురం, పాచిల్ల గ్రామాల్లో డ్రాప్ అవుట్ పిల్లలు, నెవర్ ఎన్రోల్, సింగిల్ పేరెంట్, బిపిఎల్ పిల్లలను చందేపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో ఉచితంగా 6వ తరగతి నుండి 8వ తరగతి వరకు అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యాపుస్తకాలు, నోట్ పుస్తకాలు, హాస్టల్, స్కాలర్ షిప్, ఆటలు పాటలు వంటి అన్ని వసతులతో ఏర్పాటు చేయడం జరిగిందని పిల్లలను తప్పినిసరిగా పాఠశాలలో చేర్పించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు నీల యాకయ్య, ఏడుకొండలరావు, సృజన్, ఎల్లమ్మ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరలు పంపిణీ



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ప్రజాపాలప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని 18వ డివిజన్లో కార్పొరేటర్ అలకుంట ఝాన్సీరాణి నాగరత్నం రాజు,8వ డివిజన్లో కార్పొరేటర్ వజ్జ సంతోషిణి రమేష్ యాదవ్,6వ డివిజన్లో 8వ డివిజన్లో కార్పొరేటర్ వజ్జ సంతోషిణి రమేష్ యాదవ్,19వ డివిజన్ అమూల్యకాలనీలో కార్పొరేటర్ గోగుల గణేష్ ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,నల్లగొండ పిఏసిఎస్ చైర్మన్ అలకుంట్ల నాగరత్నం రాజు,మాజీ కౌన్సిలర్ ప్రదీప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సురేష్



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా భీమనపల్లి గ్రామానికి చెందిన గూని సురేష్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ కార్యవర్గం బుధవారం ఒక ప్రకటనలో ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంక్షేమ కార్యక్రమాలను విస్తృతం చేయడంలో భాగంగా ఈ నియామకం చేపట్టినట్లు జాతీయ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అందుకున్న కార్యదర్శి తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## భిక్షమయ్య సేవలు చిరస్మరణీయం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : భిక్షమయ్య ఉద్యోగ సంఘం బలోపేతానికి అందించిన సేవలు ఆదర్శప్రాయమని నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాస్య నాయక్ పేర్కొన్నారు.తెలంగాణ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఏనుగుల భిక్షమయ్య పదవీ విరమణ సభ బుధవారం పట్టణంలోని టీఎన్జీఓఎస్ జిల్లా భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాస్య నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై సాల్వాలతో సత్కరించి మాట్లాడుతూ భిక్షమ య్య ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగ సంఘ బలోపేతానికి ఆయన అందించిన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. గత 35 సంవత్సరాలుగా ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగులకు అండగా నిలిచారని వారి సేవలను ప్రశంసించారు.ఈసభకు జిల్లా జేఏసీ చైర్మన్ నాగిళ్ల మురళి అధ్యక్షత వహించగా జిల్లా టిబి కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి,బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సంజీవయ్య,డాక్టర్ రవి ప్రసాద్,టీఎన్జీఓఎస్ నాయకులు మనోజ్ ప్రదీప్, లక్ష్మయ్య,ప్రణాదేవి,సత్యనారాయణ,అంజనేయులు,రమ్యసుధ పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెంపుదలకు కృషి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; భూగర్భ జలాల పెంపుదలకు అందరూ కృషి చేయాలని మండల పరిధిలోని కేశ్య తండా గ్రామ సర్పంచ్ రమావత్ రాజునాయక్ గ్రామంలో నిర్వహించిన జల శక్తి అభియాన్ కళాజాత అవగాహన కార్యక్రమంలో పిలుపునిచ్చారు. నీటి వనరుల సంరక్షణపై గ్రామీణ ఉపాధి హామీ పథకం జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కేశ్యతండలో నీటి వనరుల సద్వినియోగంపై కళాకారులు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం, వర్షపు నీటిని వడిసి పట్టుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచవచ్చని అన్నారు. ఏపీవో రామచంద్రం మాట్లాడుతూ కొలతల ప్రకారం పనిచేసి ప్రభుత్వం నిర్ణయించిన పనికి రోజుకు వేతనం రూ. 307లను పొందాలని ఉపాధి కూలీలకు సూచించారు. ఈకార్యక్రమంలో ఏపిఎం యాదయ్య, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, సిసి రాజేశ్వరి, టెక్నికల్ అసిస్టెంట్ యాదయ్య, ఎఫ్ఏ రమేష్, కళాకారులు, వార్డు సభ్యులు, రైతులు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం




ప్రజాపక్షం/దేవరకొండ; శంకర నేత్రాలయ వారి సౌజన్యంతో, ఎంవిఆర్ ఫౌండేషన్ మునుకుంట్ల వెంకట్‌రెడ్డి, మునుకుంట్ల విద్యావతి మరియు మునుకుంట్ల తిరుమల్‌రెడ్డి గార్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్‌లు హాజరయ్యారు. ఉచిత కంటి వైద్య శిబిరం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ శిబిరంలో భాగంగా కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు సైతం 10 రోజుల పాటు నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా వృద్ధులు కంటి సమస్యలతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంఎల్‌ఏ బాలునాయక్‌లు ప్రజల ఆరోగ్యం కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డిఒ, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడిగా శ్రీనాథ్ గౌడ్



ప్రజాపక్షం/బొమ్మలరామారం : తెలంగాణ రాజ్యాధికార పార్టీ బొమ్మలరామారం మండల అధ్యక్షుడిగా చీకటిమామిడి గ్రామానికి చెందిన బూడిద శ్రీనాథ్ గౌడ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో జనరల్ సెక్రెటరీ వట్టే జానయ్య యాదవ్ ఆయనకి నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం నిరంతరం కృషి చేస్తానని పేద ప్రజల అభివృద్ధి తన లక్ష్యంగా మండలంలో ముందుకు సాగుతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొమ్మిశెట్టి నరసింహులు, ఆ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సౌకర్యార్థం బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండల కేంద్రం నుంచి వేములకొండ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో బస్సును ప్రారంభించారు. నీర్నెముల, లక్ష్మాపురం, శోభనాద్రిపురం, కొత్తగూడెం, ములకొండ గ్రామాల ప్రజలకు ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆ గ్రామాల ప్రజలు ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేదుకు ప్రభుత్వం కట్టుబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం జాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట రాజిరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉప సర్పంచ్ మోటె రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ జమిరుద్దీన్, నాయకులు శంబాల వెంకటేష్, సాల్వేరు అశోక్, గుత్తా నరసింహా రెడ్డి, గోదాసు పృథ్వీరాజ్ తదితరులున్నారు.



## సర్కార్ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాపక్షం/నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, విద్యార్థి సమగ్ర మూర్తిమత్వానికి అవకాశం ఉంటుందని మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట సందర్భంగా మండలంలోని తాటికల్ గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవడంలో సమాజ భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. గ్రామ సర్పంచ్ బంటు రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనిల్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ పార్వతి, ప్రధానోపాధ్యాయులు రమణారావు పాల్గొన్నారు.



## దుర్గమ్మ పండుగలో ఎస్‌పి

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భువనగిరి మండలంలోని రాయిగిరి గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గమ్మ పండుగ ఉత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి కరుణాకటాక్షాలు జిల్లా ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి రూరల్ సిఐ చంద్రబాబు, ఎస్ఐ అనిల్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పోలీసు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



## చెక్కు పంపిణీ

ప్రజాపక్షం/వేములపల్లి :మండలంలోని లక్ష్మీదేవి గూడెంలో రూ.1,82,500 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును సర్పంచ్ ఎలికటి భరత్ లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంట స్వాతి,వార్డు సభ్యులు సందీప్,సతీష్, జగన్, నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.





## బడిబాట కార్యక్రమం

**ప్రజాపక్షం/చండూరుః** మండల పరిధిలోని ఇడికూడ గ్రామంలో బడిబాట కార్యక్రమంను సర్పంచ్ పాల్వాయి రమాదేవి శ్రవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాల్వాయి రమాదేవి శ్రవన్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని బడి ఈడు పిల్లలందరిని తప్పని సరిగా బడిలో చేర్పించాలని తెలిపారు. విద్యా సంవత్సరంలో చేపట్టబోయో కార్యక్రమాలపై తల్లి దండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడారి నర్సింహ్మా, ఉపాధ్యాయులు ,వార్డు సభ్యులు , పంచాయితీ కార్యదర్శి ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌చరణ్ అభిమానుల హంగామా



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రామ్‌చరణ్ జాన్వీ కపూర్ నటించిన పెద్ది చిత్రం ఈనెల 4న (నేడు) సూర్యాపేటలోని ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుడడంతో బుధవారం పట్టణంలోని ఈశ్వర్ థియేటర్ వద్ద రామ్‌చరణ్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు బైరు నిఖిల్ భార్గవ్ ఆధ్వర్యంలో హంగామా చేశారు. థియేటర్ వద్ద ఫ్లెక్సీలు, భారీ కటౌట్లు పెట్టి, పెద్ది సినిమా పేరుతో టీషర్టులు, టోపీలు ధరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో, ఏఆర్ రెహమాన్ సంగీతంతో రూపొందించిన సినిమాపై భారీ అంచనాలు ఉండడంతో తొలి ప్రీమియర్ షో టిక్కెట్ల కోసం అభిమానులు పోటీపడ్డారు.

## ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదినం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** సిద్దిపేట శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు తుర్కపల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు గోపాల్ పూర్ సర్పంచ్ పుట్ట సాయిలు, మాజీ ప్రజాప్రతినిధులు, గిద్దె కరుణాకర్ పాల్గొన్నారు.


# బోరు బావుల భద్రతపై ప్రజలు అప్రమత్తం



**దోమలపల్లిలో బోరు బావుల ప్రమాదాలపై ఎన్‌డిఆర్ఎఫ్ అవగాహన సదస్సు**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గ్రామీణ ప్రాంతాల్లో బోరు బావుల ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఆర్ఎఫ్ ఇంచార్జ్ అసిస్టెంట్ కమాండెంట్ నర్సింగు వెంకన్న అన్నారు.12వ బెటాలియన్ కమాండెంట్ కె. వీరయ్య ఆదేశాల మేరకు, బుధవారం దోమలపల్లి గ్రామంలో ఎన్‌డీఆర్ఎఫ్ బోర్‌వెల్ రెస్క్యూ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న బోరు బావులను తెరిచి ఉంచడం వల్ల చిన్నారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.వాడుకలో లేని బోరు బావులను పూర్తిగా పూడ్చివేయాలని,నీరు రాని లేదా ఖాళీగా ఉన్న బోర్లకు తప్పనిసరిగా ఇనుప మూతలు అమర్చాలని సూచించారు. పాలిథిన్ కవర్లు, బస్తాలు వంటి తాత్కాలిక ఏర్పాట్లు ప్రమాదాలను నివారించలేవని పేర్కొన్నారు.వినియోగంలో ఉన్న బోరు బావుల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు,పిల్లలు పొలాల వద్ద ఆడుకునే సమయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.గ్రామాల్లో ఎక్కడైనా మూతలు లేకుండా ప్రమాదకర స్థితిలో ఉన్న బోరు బావులు కనిపిస్తే వెంటనే గ్రామ పంచాయతీ అధికారులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.బోరు బావుల విషయంలో నిర్లక్ష్యం ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తుందని,ప్రజల సహకారంతోనే ప్రమాదాలను పూర్తిగా నివారించగలమని నర్సింగు వెంకన్న తెలిపారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ కృషి చేస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ బోర్‌వెల్ రెస్క్యూ టీం సిబ్బంది,స్థానిక ప్రజాప్రతినిధులు,రైతులు,గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బిసిలకు డిప్యూటీ సిఎం పదవితోనే సామాజిక న్యాయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తెలంగాణ రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గానికి కనీసం డిప్యూటీ సీఎం పదవినైనా కేటాయించి సామాజిక న్యాయం పట్ల తన నిబద్ధతను చాటుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీకి లేఖ రాసి మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు పార్టీల బలోపేతంలో, ప్రజాపోరాటంలో ఎల్లప్పుడు ముందుంటున్నారని, కాని అధికార పదవుల పంపకానికి వచ్చేసరికి వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుత రాజకీయ సమీకరణాల ప్రకారం రాష్ట్రంలో సీఎం పదవి బీసీలకు దక్కే అవకాశం కనిపించడం లేదని, అందువల్ల డిప్యూటీ సీఎం పదవిని బీసీ నాయకత్వానికి ఇవ్వడం ద్వారానే ఈ వర్గాల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. బీసీల ఆకాంక్షలను గుర్తించడంలో వెనుకబాటుతనం కనిపిస్తుందని, కాంగ్రెస్ అధిష్టానం ఈ విషయాన్ని అత్యంత సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి :15 మందికి గాయాలు



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** పోలీస్ స్టేషన్ పరిధిలో 4:30 గంటల సమయంలో నార్కట్‌పల్లి గ్రామ శివారులోని రహదారిపై బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది.టిఎన్18బిఎల్0873 నంబర్ గల డీసీఎం వాహనాన్ని డ్రైవర్ ఎలాంటి హెచ్చరిక సిగ్నల్స్ ఇవ్వకుండా రోడ్డుపై నిలిపివేశాడు. అదే సమయంలో 15 మంది టూరిస్టులతో ప్రయాణిస్తున్న టిజి 08యు 2888 నంబర్ గల ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగంగా,అజాగ్రత్తగా నడుపుతూ నిలిపి ఉన్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు.క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించగా,సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎలకపల్లి గ్రామానికి చెందిన ఎనగందుల ద్రోణిక (10)మృతి చెందినట్లు నిర్ధారించారు. మిగతా క్షతగాత్రులు కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.మృతురాలి తండ్రి ఎనగందుల నరేష్ ,నూతనకల్ మండలం తెలకపల్లి గ్రామ నివాసి,ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.స్టేషన్ హౌస్ ఆఫీసర్,ఎస్ఐ పందిరి విష్ణు ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక మెయిన్ సెంటర్ లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈసందర్భంగా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కేక్ కట్ చేసి హరీష్ రావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ పల్ రెడ్డి మహేందర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసిలు మాదా ధనలక్ష్మి నగేష్ గౌడ్,తరాల బలరాం, మండల అధ్యక్షులు ప్రకటపు నవీన్ రావు,మారం వెంకటరెడ్డి,పార్టీ మండల ఉపాధ్యక్షుడు జంగయ్య గౌడ్ పాల్గొన్నారు.

# టియూడబ్ల్యుజె (ఐజెయు) నకిరేకల్ మండల కమిటీ ఎన్నిక





**ప్రజాపక్షం/నకిరేకల్ :** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్‌టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నకిరేకల్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి తెలిపారు.నూతన కమిటీ అధ్యక్షుడిగా బెల్లి సాయి కుమార్,ప్రధాన కార్యదర్శిగా గడగోజు రవీంద్రాచారి.ఉపాధ్యక్షుడిగా మోహన్,కోశాధికారిగా గోపి,కార్యదర్శిగా నరసింహ, సహాయ కార్యదర్శిగా సైదులు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నాగార్జున రెడ్డి, రాజు,గోవర్ధన్,చందు ఎన్నికయ్యారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి,యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

### టియూడబ్ల్యుజె(ఐజెయు)జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) అనుబంధ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతనజిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా జక్కల పరమేష్ (హెచ్‌ఎంటీవీ), ప్రధాన కార్యదర్శిగా దోటి శ్రీనివాసులు (సీవీఆర్ న్యూస్) ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు జక్కల పరమేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం,వృత్తి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. జిల్లాలోని ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘం తరపున నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు.

### జిల్లా కమిటీలో చిట్యాల జర్నలిస్టులు





**ప్రజాపక్షం/చిట్యాలః** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు(ఐజెయు) జిల్లా కార్యవర్గాన్ని బుధవారం రోజున జిల్లాలోని నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన జిల్లా మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలి, ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డిల సమక్షంలో కమిటి ఎన్నిక జరిగింది. కాగా జిల్లా కమిటిలో చిట్యాల మున్సిపాలిటి కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయులు ఏళ్ళ బయ్యన్నను (మన తెలంగాణ) ఉపాధ్యక్షునిగా, పెద్ది నరేందర్ (ప్రజాపక్షం)ను సహాయ కార్యదర్శిగా నియమించడం జరిగింది. గతంలో వీరు జిల్లా ప్రెస్ క్లబ్‌కు ఉపాధ్యక్ష, సహాయ కార్యదర్శులుగా సేవలందించారు. వీరి నియామకం పట్ల చిట్యాల మండల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేయాలని సర్పంచ్ నోముల కృష్ణవేణి గోవిందరాజులు పేర్కొన్నారు.బుధవారం మండలంలోని పాలెం గ్రామంలో ప్రొఫసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.గ్రామస్తులు,ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య,ఇంగ్లీష్ మీడియం బోధన,డిజిటల్ తరగతుల పై ఉపాధ్యాయులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.నగేష్,టి.నర్సింహమూర్తి,జి.కల్పన,వార్డు సభ్యులు చింత పున్నమయ్య పాల్గొన్నారు.

# ఫుడ్ పార్కు భూముల్లో అక్రమాల కలకలం...

### అసైన్డ్ భూమిని ప్రైవేట్ పట్టాగా మార్చేందుకు యత్నం...?
### సర్వేను అడ్డుకుంటున్న వైనం
### హుజూర్‌నగర్ ఆర్డీవోకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రెవిన్యూ పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన అగ్రికల్చర్ ప్రాసెసింగ్ జోన్ (ఫుడ్‌పార్కు) భూసేకరణ ప్రక్రీయ వివాదాలకు కేంద్రబింధువుగా మారుతోంది. ఫుడ్‌పార్కు కోసం మండల పరిధిలోని సర్వే నెంబర్ 1041లో ప్రభుత్వం నోటిపై చేసిన 138 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు కసరత్తు చేస్తుండగా ఓ కీలక ప్రభుత్వేతర అధికారికి చెందిన ఆసైన్డ్ భూమి విషయంలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రెవిన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడం స్థానికంగా కలకలం రేపుతోంది. హుజూర్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం విధులు నిర్వహిస్తున్న పులిచింతల నరేందర్‌రెడ్డి అనే వ్యక్తికి సదరు సర్వే నెంబర్ 1041లో దాదాపు 35 గుంటల అసైన్డ్ భూమి ఉంది. అయితే సదరు వ్యక్తికి తెల్లరేషన్‌కార్డు లేకపోవడం, ఇతర ప్రైవేట్ పట్టా భూములుకలిగి ఉండటంతో నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూసేకరణలో నష్టపరిహారం దక్కదనే ఆందోళన మొదలైంది. దీనికి తోడు ఫుడ్‌పార్కు ఏర్పాటు కానుండటంతో చుట్టుపక్కల భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో సదరు అసైన్డ్ భూమిని పక్కనే ఉన్న ప్రైవేట్ పట్టా సర్వే నెంబర్‌లో కలిపేసి, భూమిని ప్రైవేట్ పట్టాగా మార్చుకునేందుకు ఒక వ్యక్తితో కలిసి సదరు సిఈవో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు జోరుగా వస్తున్నాయి. ఇందులో భాగంగానే అధికారులు సదరు వ్యక్తికి చెందిన 35 గుంటల భూమిని సర్వే చేయకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం. ఈ అక్రమ మార్గం ద్వారా భూమిని భారీ ధరకు అమ్ముకోవాలనే దురాశతోనే ఈ వ్యవహారానికి తెరలేపినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిని ప్రైవేట్ పట్టాగా మార్చే ప్రయత్నాలపై స్థానిక రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)కి పలువురు లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. ఈ వ్యవహారంపై లోతైన విచారణ జరిపి, సదరు వ్యక్తి ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని, అతనికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించకూడదని డిమాండ్ చేశారు. ఒకవేళ స్థానిక అధికారులు ఈ అక్రమాలపై స్పందించకుంటే సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తో పాటు భూ పరిపాలన ప్రధాన కమిషనర్, న్యాయస్థానాన్ని అశ్రయిస్తామని హెచ్చరించారు.

## వీధి కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/తిరుమలగిరి(సాగర్)** :మండల కేంద్రంలో వీధి కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పగడాల పున్నమ్మ, సైదులు యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు.గత కొన్ని రోజులుగా వీధి కుక్కల సంఖ్య బాగా పెరిగిందని,అవి వీధిలో పిల్లలు,వృద్ధులు,పశువులు,కోళ్లపై దాడి చేస్తున్నాయని వాపోయారు.రోజువారీ పనులకు వెళ్లే ప్రజలు బయటకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు.కొద్ది రోజుల క్రితం పశువులపై దాడి చేసిన ఘటనలో కొన్ని మూగజీవాలు మృతిచెందాయన్నారు. రాత్రి వేళల్లో కుక్కలు చేసే అరుపులతో నిద్రకు భంగం కలుగుతోందని,వాతావరణ మార్పుల వల్ల అవి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.వీధి కుక్కల బారిన పడకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

## 5న గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 5న ప్రతి గ్రామంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించాలని మిర్యాలగూడ డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులను ఆదేశించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంతోపాటు ఈనెల 4,6,8న పారిశుధ్ధ్యంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందని ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో మాతంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ముందస్తు మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలి : ఆర్‌డిఓ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రత్యేక విస్తృత ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ముందస్తు మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ సూపర్‌వైజర్లు, ఆఫీసర్ల సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. పట్టణంలో ఇప్పటివరకు 56,384 మంది(మొత్తం 93,207), మండలంలో 44,530 మంది(మొత్తం ఓటర్లు 55,672) ఓటర్ల మ్యాపింవ పూర్తయిందని తెలిపారు. ఈనెల 15నాటికి కనీసం 85శాతం లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం చల్లటి వేళల్లో సిబ్బంది ఇంటింటికి తిరిగి 2002 నాటి ఓటర్ల జాబితా మ్యాపింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు నిబద్ధతతో పనిచేసి ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ శ్రీజారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రింగు ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ కల్పన, బూత్ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## పశుసంవర్ధక వైద్యాధికారిగా మనోజ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం /నార్కట్‌పల్లి :** మండల పశుసంవర్ధక శాఖ నూతన వైద్యాధికారిగా డాక్టర్ మనోజ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నందున పశువుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు.నివారణకు అవసరమైన టీకాలు,మందులు పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.కుక్కకాటుకు గురైన పశువులకు వేసే యాంటీరేబిస్ ఇంజక్షన్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.పాడి పరిశ్రమ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని,రైతులకు 24 గంటలు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. శస్త్రచికిత్సకు సంబంధించిన మందులు,టీకాలు పూర్తిస్థాయిలో ఉన్నాయని, పశుపోషకులు ఆందోళన చెందవద్దని సూచించారు. సమస్య ఉంటే వెంటనే మండల పశువైద్యశాలను సంప్రదించాలని కోరారు.

## అడిషనల్ ఎస్‌పి భుజంగరావు బంధువుల ఇంట్లో సోదాలు

**ప్రజాపక్షం/తుంగతుర్తి** : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో హైదరాబాద్‌లో ఇటీవల ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నింధితుడు, అక్రమాస్తులతో సస్పెన్షన్‌లో ఉన్న అడిషనల్ ఎస్‌పి భుజంగరావు బంధువులైన (మామ) రిటైర్డ్ పోలీసు అధికారి దుగ్యాల రాజేశ్వర రావు ఇంట్లో బుధవారం ఏసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసిబి అధికారి బాలకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటిలో ఎవరులేరని, తాళం వేసి ఉండడంతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టలేకపోయామన్నారు. తదుపరి విచారణ జరగనున్నట్లు తెలిపారు. ఏసిబి సిబ్బంది పాల్గొన్నారు.



## ఫీజుల మాఫియాపై ఉద్యమిస్తాం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఫీజుల దోపిడిపై, పుస్తకాలు, యూనిఫాంల పేరిట సాగిస్తున్న వ్యాపార సామ్రాజ్యంపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వర్‌రావులు హెచ్చరించారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యా సంస్థల యాజమాన్యాలు దోపిడికి సిద్ధమవుతున్నా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు కళ్లుండి చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారని అన్నారు. ఫీజుల భారం వల్ల మిర్యాలగూడలోని పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం భూములు, నగలు అమ్ముకోని ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి స్కూళ్లకు చెల్లిస్తున్నా అధికారులకు కనపడకపోవడం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. ఈ దోపిడిని అరికట్టకపోతే అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. సమావేశంలో కొంరపిడిత సురేష్, పట్టేటి రమేష్, శంకర్, ఉపేందర్, గంగాధర్, రాంబాబు, మణి తదితరులు ఉన్నారు.

## పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అకడమిక్ గైడెన్స్ కమిటీ వైస్ చైర్మన్‌గా యుగంధర్

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రానికి చెందిన నక్క యుగంధర్‌ను పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అకడమిక్ గైడెన్స్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమిస్తూ పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది.ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ సంయుక్తంగా నియామక పత్రాన్ని విడుదల చేశారు.విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న నక్క యుగంధర్‌కు ఈ బాధ్యతలు అప్పగించడంపై ఉపాధ్యాయులు, మిత్రులు,గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## పరిస్థితులకు అనుగుణంగా పంటలు

**ప్రజాపక్షం/నాంపల్లి :** ఎల్‌నినో పరిస్థితుల కారణంగా ఈ వానాకాలంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారని మండల వ్యవసాయ అధికారి బండారు శివ తెలిపారు.ఈ నేపథ్యంలో రైతులు నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చిరుధాన్యాలుజొన్న,సజ్జ,రాగి పప్పుధాన్యాలు కంది,పెసర, మినుము,నూనె గింజల పంటలు వేరుశెనగ,నువ్వులు,ఆముదం సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.ఈ పంటలు తక్కువ నీటితో సాగవడమే కాకుండా ఎండ పరిస్థితులను కొంతవరకు తట్టుకొని రైతులకు ఆదాయ భద్రత కల్పిస్తాయని తెలిపారు. రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని,నేలలో తేమను నిల్వ ఉంచే యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.వర్షాలపై పూర్తిగా ఆధారపడకుండా,అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు.

## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆల్ ఇండియా అడ్వాన్స్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ పరీక్ష ఫలితాలలో ఆల్ ఇండియా 399 ర్యాంకు సాధించిన నల్లగొండలోని నల్లగొండలోని రామగిరి ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి రామావత్ చంటి కి కౌన్సిలింగ్ ఖర్చుల నిమిత్తం డి ఎస్ ఆర్ సత్యం ఫౌండేషన్ తరపున ఫౌండేషన్ చైర్మన్ దోనాల శ్రీనివాస్ రెడ్డి బుధవారం రామావత్ చంటి తండ్రి రమావత్ బీమా కి 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో మధు ,రమణారెడ్డి తదితరులు లు పాల్గొన్నారు.

